క్లుప్తంగా

రోడ్డు పనులకు భూమిపూజ



తుంబిగనూరులో భూమి పూజ చేస్తున్న మురళీమోహన్ రెడ్డి

కోసిగి: మండలంలోని తుంబిగనూరు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన వినతుల్లో రూ.5లక్షలతో సీసీ, డ్రైనేజీ పనులు చేయిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ పి.మురళీ మోహన్ రెడ్డి తెలిపారు. సోమవారం గ్రామంలో సర్పంచ్ వారం ఈరన్న ఆధ్వర్యంలో రోడ్డు పనులకు భూమి పూజ చేశారు. పనులు పూర్తయితే గ్రామం అంతటా డ్రైనేజీ, సీసీ రోడ్లు వేసినట్లు అవుతుందని చెప్పారు.

శ్మశాన వాటికకు భూమి కేటాయించాలి

ఆదోని రూరల్ : పట్టణ జనాభా పెరుగుదలకు అనుగుణంగా శ్మశాన వాటికకు భూమి కేటాయించాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డిని కోరారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో కేవీపీఎస్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు, నాయకులు అంజి, నాగేంద్ర, విజయ్, గోపాల్, లక్ష్మన్న, తిప్పన్న కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న శ్మశాన వాటికలో స్థలం లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఐదెకరాలు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

జీఓ రద్దు చేయాలి

ఆదోని రూరల్: భావప్రకటన స్వేచ్ఛను హరించేలా ప్రభుత్వం తీసుకొచ్చిన జీఓ నంబర్ 1ని రద్దు చేయాలని పీడీఎస్‌యూ కర్నూలు జిల్లా అధ్యక్షుడు అఖండ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని ఎమ్మిగనూరు సర్కిల్‌లో ధర్నా చేపట్టారు. నిరసన కార్యక్రమానికి సంఘం డివిజన్ అధ్యక్షుడు మల్లికార్జున అధ్యక్షత వహించగా అఖండ మాట్లాడారు. ఉద్యోగులందరికీ ప్రతినెలా 1వ తేదీనే వేతనాలు చెల్లించాలని, పీఆర్‌సీ అమలు చేయాలని, ఓపీఎస్ అమలు చేసి, సీపీఎస్ రద్దు చేయాలని కోరారు. జిల్లా ఉపాధ్యక్షుడు రమణ, డివిజన్ ఉపాధ్యక్షుడు అనిల్, సహాయ కార్యదర్శి నవీన్, మహేష్, ప్రేమ్ పాల్గొన్నారు.

భారీ వాహనాలు వెళ్లకుండా చర్యలు



వాహనాలు వెళ్లకుండా ఇనుప రాడ్డు ఏర్పాటు చేసిన దృశ్యం

ఆదోని అర్బన్ : పట్టణంలోని పాత ఓవర్ బ్రిడ్జిపై భారీ వాహనాలు వెళ్లకుండా మున్సిపల్, పోలీసు అధికారులు చర్యలు చేపట్టారు. పాత ఓవర్‌బ్రిడ్జి శిథిలావస్థకు చేరుకోవడంతో పోలీసులు వాహనాలను మళ్లించేవారు. అయితే పోలీసులు లేని సమయంలో వాహనాల రాకపోకలు కొనసాగేవి. ప్రమాదాల నివారణకు సోమవారం ఇనుప రాడ్డును అడ్డుగా ఏర్పాటు చేశారు. దీంతో భారీ వాహనాల రాకపోకలు సాగించడానికి వీలుండదు.

పెండింగ్ డీఏలు మంజూరు చేయాలి



మాట్లాడుతున్న నాగరాజు

ఆదోని అర్బన్ : పెండింగ్‌లో ఉన్న డీఏలను మంజూరు చేయాలని ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి నాగరాజు, కౌన్సిలర్ లోక్యానాయక్ కోరారు. సోమవారం స్థానిక నెహ్రూ మెమోరియల్ ఉన్నత పాఠశాలలో వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం డీఏల మంజూరు, సీపీఎస్ రద్దు చేయాలని, పీఎఫ్, ఏపీజీఎల్ఐ తదితర మొత్తాలు చెల్లించాలని, మున్సిపల్ ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని కోరారు. నాయకులు ప్రహ్లాద్, మారయ్య, ప్రసాద్, రామయ్య, ఉరుకుందప్ప, కళ్యాణ్‌రావు, సతీష్, విజయ్ పాల్గొన్నారు.

రహదారులను అభివృద్ధి చేయండి



కర్నూల్‌లో ఆర్అండ్‌బీ ఎస్ఈ నాగరాజుతో మాట్లాడుతున్న చంద్రశేఖర్‌రెడ్డి

పెద్దకడబూరు : మంత్రాలయం నియోజకవర్గంలోని రహదారులను అభివృద్ధి చేయాలని రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి కోరారు. కర్నూల్‌లో ఆర్అండ్‌బీ ఎస్ఈ నాగరాజుతో సోమవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో రోడ్ల స్థితిగతులను వివరించారు.

జగనన్న తపన అభినందనీయం

మంత్రాలయం/కౌతాళం : పేదల సంక్షేమం కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పడుతున్న తపన అభినందనీయమని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సోమవారం కౌతాళం మండల ఉప్పరహాల్ గ్రామంలో పర్యటించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర యూత్ కమిటీ సభ్యుడు వై.ప్రదీప్‌కుమార్ రెడ్డితో కలిసి గ్రామంలో ఇంటింటినీ సందర్శించారు. మూడున్నరేళ్లలో ప్రభుత్వం నుంచి మంజూరైన వివిధ సంక్షేమ పథకాల వివరాలను లబ్ధిదారులకు వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల జీవన ప్రమాణాలు మెరుగుపరచాలనే ఉద్దేశంతోనే జగనన్న సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు. బతుకులకు భరోసా ఇవ్వడంలో ఆయనకున్న స్పష్టత ఎవరికీ లేదన్నారు. పేదల గుండెల్లో చెరగని ముద్ర వేసుకునేలా పాలన సాగిస్తున్నారన్నారు. రైతుల కోసం రైతు భరోసా, పంట బీమా, నష్ట పరిహారం పథకాలు ప్రవేశపెట్టడం చరిత్రాత్మకమన్నారు. ఆరోగ్యశ్రీ, వైఎస్సార్ చేయూత, అమ్మ ఒడి, విద్యా కానుక, తదితర పథకాలు పేదలకు వరంగా మారాయన్నారు. గ్రామ/వార్డు సచివాలయ వ్యవస్థ ప్రవేశపెట్టి ప్రజల దరికి పాలన తీసుకువచ్చారని వివరించారు. పర్యటన అనంతరం గ్రామ సచివాలయాన్ని సందర్శించి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. సచివాలయ ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా నడుచుకోవాలని సూచించారు. వలంటీర్లు ఎప్పటికప్పుడు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆదేశించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అత్రితనయగౌడ్, ఉరుకుంద ఈరన్న స్వామి ట్రస్టుబోర్డు చైర్మన్ నాగరాజుగౌడ్, జెడ్పీటీసీ రాధా ప్రియదర్శిని, వైస్ ఎంపీపీ బుజ్జిస్వామి, సర్పంచ్ తులసి, ఇన్‌చార్జ్ ఏకాంబరరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అనుసుమ, ఎస్ఐ నరేంద్రకుమార్ రెడ్డి, నాయకులు వెంకట్రామిరెడ్డి, గురునాథ్‌రెడ్డి పాల్గొన్నారు.



లబ్ధిదారులకు సంక్షేమ పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి



సీఎం వైఎస్ జగన్ చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే

గ్రామాల అభివృద్ధే వైఎస్సార్‌సీపీ ధ్యేయం

కౌతాళం: గ్రామాల అభివృద్ధే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని రౌడూరు గ్రామంలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. గ్రామంలో జలజీవన్ మిషన్ పథకం కింద రూ.43.56 లక్షలతో ఓహెచ్ఆర్, పైప్‌లైన్, ఇంటింటికీ కొళాయిల ఏర్పాటు పనుల్ని ప్రారంభించారు.రూ.1.77కోట్లతో గ్రామానికి మరో ఎస్ఎస్ ట్యాంకు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపామని చెప్పారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన గ్రామసభలో కొత్త పింఛన్లను పంపిణీ చేశారు. అనంతరం జెడ్పీ పాఠశాలలో రూ.1.32 కోట్లతో జరుగుతున్న అదనపు గదుల పనులను పరిశీలించారు. విద్యార్థులతో ముచ్చటించి మధ్యాహ్న భోజనంపై అడిగి తెలుసుకున్నారు. సర్పంచ్ సుశీల, ఉప సర్పంచ్ సుజాత, బుజ్జిస్వామి, నాయకులు సుధాకర్‌రెడ్డి, సోమిరెడ్డి, ఏకాంబర్‌రెడ్డి పాల్గొన్నారు.

చెదరని 'సంకల్పం'

కౌతాళం/మంత్రాలయం : పాదయాత్రలో.. ప్రస్తుతం పాలనలోనూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెదరని సంకల్పంతో ముందుకు సాగుతున్నారని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి పేర్కొన్నారు. జగనన్న ప్రజా సంకల్ప యాత్ర ముగిసి నాలుగేళ్లు అయిన సందర్భంగా పార్టీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. సోమవారం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో కౌతాళం మండల కేంద్రంలో వేడుక జరుపుకున్నారు. ముందుగా వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే జగనన్న చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. ఆయన మాట్లాడుతూ నాలుగేళ్ల క్రితం ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు ప్రజ సంకల్ప యాత్ర చేపట్టారని, నాటి యాత్రతోనే నవరత్నాలు పథకాలను అమలు చేయడమే కాకుండా, వారి సమస్యలు పరిష్కరించేలా పాలన సాగిస్తూ వారి హృదయాలను గెలుచుకున్నారని కొనియాడారు.

ఈరన్న స్వామికి ప్రత్యేక పూజలు



పూజలందుకుంటున్న ఈరన్నస్వామి

కౌతాళం: మండలంలోని ఉరుకుంద గ్రామంలో వెలసిన ఈరన్న స్వామి వారికి సోమవారం సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పూజలు చేశారు. భక్తుల రాకతో క్షేత్రం కిటకిటలాడింది. అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌కు తెల్లవారు జామున సుప్రభాతసేవ, మహామంగళహారతి, పంచామృతాభిషేకం, విశేష పూజలు జరిపించి ప్రత్యేకంగా అలంకరించి భక్తులను దర్శనానికి అనుమతించారు. మొక్కులు చెల్లించుకోవడంలో భాగంగా కొందరు భక్తులు ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు చేయించుకున్నారు. పలువురు పిండి వంటలు వండి స్వామి వారికి నైవేద్యం సమర్పించారు.

కనీస వేతనమివ్వాలి

ఆదోని రూరల్ : అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం యూనియన్ ఆధ్వర్యంలో పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం సబ్ లెక్టర్ అభిషేక్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. యూనియన్ జిల్లా కార్యదర్శి వెంకటమ్మ, జిల్లా నాయకురాలు వరలక్ష్మి, సీఐటీయూ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు తిప్పన్న, గోపాల్ మాట్లాడుతూ సెంటర్‌లకు నిధులు పెంచి అంగన్‌వాడీలకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. సుప్రీంకోర్టు తీరుప్ప ప్రకారం గ్రాట్యుటీ అమలు చేయాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ రూ.5 లక్షలు ఇవ్వాలని కోరారు.మండల కార్యదర్శి వీరారెడ్డి, లక్ష్మన్న పాల్గొన్నారు.

ప్రభుత్వ హాస్టళ్లకు సొంత భవనాలు కేటాయించాలి



సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

ఆదోని రూరల్ : ఆదోనిలో ఉండే ప్రభుత్వ హాస్టళ్లకు సొంత భవనాలు కేటాయించాలని, విద్యార్థులకు కాస్మోటిక్ చార్జీలు పెంచాలని ఆర్‌పీఎస్ఎఫ్, బీడీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పట్టణంలోని సబ్ కలెక్టర్ ఆఫీసు ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. బీడీఎస్ఎ'రాష్ట్ర కన్వీనర్ రమేష్, ఆర్‌పీఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నవీన్‌కుమార్, జిల్లా కార్యదర్శి బాలు మాట్లాడుతూ ఆదోని రెవెన్యూ డివిజన్‌లో ప్రభుత్వ హాస్టళ్లకు సొంత భవనాలు లేవన్నారు. రాష్ట్రంలోనే అక్షరాస్యతలో వెనకబడిన ప్రాంతం, నిత్యం కరువు తాండవమాడుతున్న ప్రాంతంలో చదువుకోవాలని ఆసక్తి ఉన్న విద్యార్థులు, తల్లిదండ్రులు సౌకర్యాల లేమితో ఉన్న హాస్టళ్ల పట్ల ఆసక్తి చూపడం లేదన్నారు. దీంతో పల్లెల నుంచి వచ్చే విద్యార్థులు చదువు మధ్యలోనే నిలిపివేసి వలసలు వెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాయకులు హరి,కృష్ణ, బోయేజు, విజయ్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

'స్పందన' అర్జీలను తిరస్కరించొద్దు

ఆదోని రూరల్ : స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించి అర్జీదారులను సంతృప్తిపరిచేలా చూడాలని ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ ఆదేశించారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమంలో పాల్గొని డివిజన్‌లోని ఆయా మండలాల ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ సమస్యల వారంలోపు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పరిపాలనాధికారి గోవిందసింగ్, డీఎల్‌పీఓ నూర్జహాన్, డిప్యూటీ డీఎంహెచ్ఓ సత్యవతి, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణుసూర్య, ఎస్‌డబ్ల్యూఓ సుధాకర్, సీనియర్ సహాయకులు రామయ్య పాల్గొన్నారు.



ప్రజల నుంచి వినతులను స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్

మున్సిపల్ 'స్పందన'కు వినతులు

ఆదోని అర్బన్ : వివిధ సమస్యలతో ఇబ్బందులు పడుతున్న పట్టణవాసులు సోమవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డికి అర్జీలు సమర్పించారు. పట్టణంలోని పూనిమొల్ల, దేవీనగర్, విజయనగర్, ఎన్జీవోస్ కాలనీ తదితర కాలనీవాసులు వైఎస్సార్ హౌసింగ్ స్కీం, పింఛన్, బీమా పథకం, ఆస్తుల సమస్యలపై ఐదుగురు పత్రం అందజేశారు. అలాగే అర్హులైన పింఛన్‌లను తొలగించారని, వాటిని పునఃరుద్ధరించాలని సీపీఐ నాయకులు వినతి పత్రం అందజేశారు.

ఫల్కందొడ్డి వృషభాల జయకేతనం



ఖాజాహుసేన్‌కు బహుమతి ప్రదానం చేస్తున్న జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి, జగన్‌మోహన్ రెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: నీలకంఠేశ్వర స్వామి జాతర సందర్భంగా ఎమ్మిగనూరు రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం న్యూ క్యాటగిరీ వృషభాల బండ లాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. పోటీల్లో కర్ణాటక రాష్ట్రం రాయచూరు జిల్లా ఫల్కందొడ్డి వృషభాలు గెలుపొందగా యజమాని ఖాజాహుసేన్‌కు జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి రూ.50 వేల నగదు బహుమతి అందజేశారు. రెండో స్థానం గోనెగండ్ల మండలం చిన్ననెలటూరు వృషభాల యజమాని గాజుల కుమారస్వామికి రూ.40 వేలు, మూడో స్థానం ఓర్వకల్లుకు చెందిన వృషభాల యజమాని మంగలి నడిపి వెంకటేశ్వర్లుకు రూ.30 వేలు, నాల్గవ స్థానం తాడిపత్రి తాలుకా గన్నెవారిపల్లె వృషభాల యజమాని రమేష్‌బాబు యాదవ్‌కు రూ.20 వేలు, ఐదో స్థానం నంద్యాల జిల్లా భీమవరం వృషభాల యజమాని జీకె రెడ్డికి రూ.10 వేల నగదు బహుమతులు అందజేశారు. నిర్వాహకులు బీఆర్ బసిరెడ్డి, సోగనూరు భీమిరెడ్డి, కుమారస్వామి, వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, పోటీల వ్యాఖ్యాతలు రామానాయుడు, కలాం తదితరులు పాల్గొన్నారు.

డ్రిప్ ఇరిగేషన్‌తో అధిక ప్రయోజనం

వెల్దుర్తి: డ్రిప్ ఇరిగేషన్ (బిందు సేద్యం)తో రైతులకు నీటి ఆదాతో పాటు అధిక మేలు జరుగుతుందని ఏపీఎంఐపీ (డ్రిప్ ఇరిగేషన్) స్టేట్ పీఓ హరినాథ్‌రెడ్డి అన్నారు. ఆయన సోమవారం నంద్యాల, కర్నూలు జిల్లాల్లో రైతులకు సబ్సిడీపై అందించిన పరికరాలు, డ్రిప్ విధానంలో సాగు చేసిన పంటలను పరిశీలించారు. ఓర్వకల్లు మండలం కాలువ గ్రామ రైతు వెంకటేశ్వర్లు మూడెకరాలలో సాగు చేసిన అరటి పంట, వెల్దుర్తి మండలం రామళ్లకోటలో రైతు బాలు ఎకరా పొలంలో సాగు చేసిన కరివేపాకు పంట, కృష్ణగిరి మండలం తొగర్చేడు రైతు వెంకటేశ్వరరెడ్డి ఐదెకరాలలో సాగు చేసిన మామిడి మొక్కలను పరిశీలించారు. రామళ్లకోట రైతు బాలు ఎకరా పొలంలో రూ.45 వేల డ్రిప్ పరికరాలు 10 శాతం ధరకు పొంది (90 శాతం సబ్సిడీ) ఒక ఇంచు నీటితో కరివేపాకు సాగుచేసి అధిక లాభాలు ఆర్జించినట్లు తెలుసుకుని సంతోషం వ్యక్తం చేశారు. పీఓ హరినాథ్‌రెడ్డి మాట్లాడుతూ డ్రిప్ ఇరిగేషన్ ద్వారా తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో పంటలు సాగు చేయవచ్చని, మొక్కలకు అందించాల్సిన ఎరువులు, మందులు పక్కాగా అవసరమైన వరకు అందించవచ్చని తద్వారా అధిక దిగుబడులు పొందవచ్చని వివరించారు. ప్రభుత్వం 90శాతం సబ్సిడీతో డ్రిప్ సౌకర్యం కల్పిస్తోందని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏపీఎంఐపీ జిల్లా పీడీ ఉమామహేశ్వరమ్మ, ఏపీడీ రాజాకృష్ణారెడ్డి, కర్నూలు సెక్టార్ హార్టికల్చర్ ఆఫీసర్ విజయలక్ష్మి, రైతులు ఉన్నారు.



రామళ్లకోటలో డ్రిప్ విధానాన్ని పరిశీలిస్తున్న ఏపీఎంఐపీ స్టేట్ పీఓ హరినాథరెడ్డి, జిల్లా అధికారులు

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

హొళగుంద: మండల కేంద్రానికి చెందిన శేకన్న (25) సోమవారం విషపు గుళికలు తిని తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. మానసిక స్థితి సరిగా లేని శేకన్న పొలంలో చెట్లకు ఎరువుకోసం పెట్టే గుళికలను తిన్నట్లు గ్రామస్తులు తెలిపారు. కుటుంబ సభ్యులు గమనించి స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. వైద్య సిబ్బంది ప్రాథమిక చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో ఆదోని ఏరియా ఆస్పత్రికి రెఫర్ చేశారు.

ప్రజాసంకల్ప యాత్రతోనే 'నవరత్నాలు'

- పట్టణంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తల ర్యాలీ
- వైఎస్సార్ విగ్రహానికి నివాళి



వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆదోని అర్బన్ : ఇడుపులపాయ నుంచి ఇచ్ఛాపురం వరకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన ప్రజాసంకల్ప పాదయాత్రలో ప్రజల కష్టాలు తెలుసుకుని ముఖ్యమంత్రి అయిన తరువాత వారి కష్టాలను రూపుమాపడానికి నవరత్నాల పథకాలు అమలు చేశారని వైఎస్సార్‌సీపీ పట్టణ గౌరవాధ్యక్షుడు చంద్రకాంత్‌రెడ్డి, వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ మధుసూదన్, మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత, పట్టణాధ్యక్షుడు దేవా పేర్కొన్నారు. సోమవారం ప్రజా సంకల్పపాదయాత్ర ముగిసి నాలుగు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా పార్టీ కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. ముందుగా ఆయా కార్పొరేషన్‌ల చైర్మన్‌లు రేణుక, మంజుల, ధర్మన్న, కామాక్షి తిమ్మప్ప, పట్టణాధ్యక్షుడు, సీనియర్ నాయకులు గోపాల్‌రెడ్డి, మధుసూదన్‌శర్మ, శ్రీలక్ష్మి, కౌన్సిలర్‌లు చిన్నా, చలపతి, ఇంతియాజ్‌తో కలిసి కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం పార్టీ కార్యాలయం నుంచి కోట్ల కూడలి మీదుగా స్థానిక ఏరియా ఆస్పత్రి వద్దనున్న వైఎస్సార్ విగ్రహం వరకు బైకు ర్యాలీ చేపట్టారు. వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ 3648 కి.మీ. పాదయాత్ర చేసి ప్రజల ఇబ్బందులను పరిష్కారం కోసమే ప్రస్తుతం పథకాలు అమలు చేస్తున్నారని చెప్పారు. సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే జగనన్న సీఎం కొనసాగాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని, ఇందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు తోడుగా ఉండాలని కోరారు. టీడీపీ ఆరోపణలను, విమర్శలను తిప్పికొట్టాలని, వారి మోసపూరిత మాటలను ప్రజలకు వివరించాలని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు గంగాధర్, గోవిందరాజులు, నాగరాజు, సుధాకర్, అశోక్, ప్రసాద్, తిక్కన్న, మల్లి, రహీం, యాసిన్, హరి, గుండా, నబి, బాషా, చంద్రశేఖర్, ఉదయ్, తాయన్న, రామకృష్ణ, బ్రహ్మ పాల్గొన్నారు.

నివాళి

మంత్రాలయం రూరల్: మండల కేంద్రంలోని రాఘవేంద్రనగర్‌కు చెందిన నాగరాజు అనే వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఆదివారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ రాష్ట్ర యూత్ నాయకుడు వై.ప్రదీప్‌రెడ్డి సోమవారం మంత్రాలయం చేరుకుని నాగరాజు మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి వైఎస్సార్ బీమా పథకం తక్షణ సహాయం కింద రూ.10 వేలు, సొంతంగా మరో రూ.10 వేలు, సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య రూ. 5 వేలు అందజేశారు. పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి అశోక్ రెడ్డి, వెల్ఫేర్ అధికారిణి అనిత ఉన్నారు.

ఆర్టీఓ కార్యాలయానికి స్థలం కేటాయింపు



శివారెడ్డి, ఆర్‌టీఓ

ఆదోని అర్బన్ : మండలంలోని బైచిగేరి గ్రామ సమీపంలో ఆర్టీఓ కార్యాలయ నిర్మాణానికి ఐదు ఎకరాల స్థలం కేటాయించినట్లు కలెక్టర్ల నుంచి ఆదేశాలు అందాయని ఆర్‌టీఓ శివారెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆదోని ఆర్టీఓగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డిని కలిసి కార్యాలయానికి స్థలం కేటాయించాలని కోరామన్నారు. ప్రభుత్వం కొన్ని నియోజకవర్గాలను జిల్లాలుగా, డివిజన్‌లుగా మార్పు చేసిందని, దీంతో ఆదోనికి ఆర్టీఓ కార్యాలయం వచ్చిందన్నారు. మరో రెండు రోజుల్లో రెవెన్యూ అధికారులు ఆర్టీఓ కార్యాలయానికి బైచిగేరి వద్ద ఐదు ఎకరాల స్థలం అప్పగిస్తారని చెప్పారు. స్థలం కేటాయింపుపై ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, తహసీల్దార్ వెంకటలక్ష్మికి కృతజ్ఞతలు తెలిపారు. అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్‌రెడ్డి ఉన్నారు.

నిర్దేశిత లక్ష్యం సాధించాం..

ఆదోని ఆర్టీఓ కార్యాలయానికి నిర్దేశించి 167 శాతం టార్గెట్‌ను ఎంవీఐ సిసిరాదీప్తి, ఏఎంవీఐ సుధాకర్‌రెడ్డి పూర్తి చేశారన్నారు. జూలై నుంచి డిసెంబర్ చివరి వరకు రూ.కోటి రెండు లక్షలు లక్ష్యం కాగా.. రూ.1.70 కోట్లు చేశామని చెప్పారు.

ట్రాక్టర్ ట్యాలీల ట్యాక్స్ చెల్లించాలి

డివిజన్ పరిధిలో 600 ట్రాక్టర్ ట్రాలీలు ట్యాక్స్ కట్టకుండా పెండింగ్‌లో ఉన్నాయని, వెంటనే చెల్లించాలని తెలిపారు. స్వచ్ఛందంగా వచ్చి ట్యాక్స్ చెల్లిస్తే అపరాధ రుసుము విధించమన్నారు. తనిఖీలో పట్టుబడితే అపరాధ రుసుముతో చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. గతంలో ఏపీఆర్‌టీఏలో లైసెన్సులు, ఎల్ఎల్ఆర్‌లు తదితర వాటిని దరఖాస్తు చేసుకునేవారని, ప్రస్తుతం కొత్తగా సాఫ్ట్‌వేర్ వచ్చిందని, వాహన వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు.

15 నుంచి బాల్ బ్యాడ్మింటన్ పోటీలు

గోనెగండ్ల: సంక్రాంతి పండుగ సందర్భంగా గోనెగండ్లలో 15వ తేదీ నుంచి రాయలసీమ స్థాయి, ఉమ్మడి జిల్లా గ్రామీణ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు రామన్, బాషా తెలిపారు. వారు సోమవారం మాట్లాడుతూ.. రాయలసీమ స్థాయి పోటీల విజేతలకు మొదటి బహుమతి రూ.20 వేలు, రెండవ బహుమతి రూ.15 వేలు, మూడవ బహుమతి రూ.8 వేలు, నాల్గవ బహుమతి రూ.5 వేలు. అలాగే గ్రామీణ స్థాయి విజేతలకు వరుసగా రూ.8 వేలు, రూ.6 వేలు, రూ.4 వేలు, రూ.2 వేలు అందించనున్నట్లు వివరించారు. ఆసక్తి గల క్రీడాకారులు 14వ తేదీ లోపు రాయలసీమ స్థాయి పోటీలకు రూ.500, గ్రామీణ స్థాయి పోటీలకు రూ.350 చెల్లించి జట్టు పేరు నమోదు చేసుకోవాలని, వివరాలకు 99899 57105, 96403 99563 నంబర్లను సంప్రదించాలన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్

ఎమ్మిగనూరుటౌన్: క్రీడల్లో పాల్గొనడం ద్వారా ఆటగాళ్ల నైపుణ్యం పెరుగుతుందని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి, బీఆర్ బసిరెడ్డి పేర్కొన్నారు. శ్రీ నీలకంఠేశ్వర స్వామి జాతర మహోత్సవం సందర్భంగా సోమవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఆర్గనైజర్లు మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, విశ్వనాథ్ రమేష్ నిర్వహణలో జరుగుతున్న వైఎస్సార్ అంతర్రాష్ట్ర కబడ్డీ, వాలీబాల్ పోటీలను మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు, పట్టణ, రూరల్ సీఐలు మధుసుదన్‌రావు, మంజునాథ్‌లతో కలిసి ఆయన ప్రారంభించారు. క్రీడాకారులు స్నేహభావంతో ఆడాలని గెలుపోటములు సమానంగా తీసుకోవాలని సూచించారు. పార్టీ నాయకులు, మున్సిపల్ కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జ్‌లు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మిగనూరులోని ఇండోర్ స్టేడియంలో కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

జగనన్న పాలనలో పేదలకు అందలం

- ఆలూరులో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం
- 3వ సచివాలయం పరిధిలో రూ.12 కోట్లతో అభివృద్ధి పనులు పూర్తి



ఆలూరులో లబ్ధిదారుడికి సంక్షేమ క్యాలెండర్ అందజేస్తున్న మంత్రి గుమ్మనూరు జయరాం

ఆలూరు: వైఎస్సార్‌సీపీ పాలనలో పేదల కష్టాలను గుర్తించి శాశ్వతంగా పరిష్కరించడంతో వారు సుఖసంతోషాలతో ఉన్నారని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు. ఆలూరు 3వ సచివాలయం పరిధిలో సోమవారం మండల కన్వీనర్ వీరేష్ ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి గుమ్మనూరు జయరాం ఇంటింటికీ వెళ్లి మూడున్నరేళ్ల పాలనలో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు వివరిస్తూ బుక్‌లెట్‌లను అందజేశారు. మంత్రి మాట్లాడుతూ ఆర్థిక, సామాజిక రంగాల్లో అట్టడుగున ఉన్న వారికి అండగా నిలిచి సంక్షేమ పథకాలను మంజూరు చేయడం ద్వారా వారి ఆర్థిక పరిపుష్టిని పెంచడం జరిగిందన్నారు. పలు కాలనీలలో దాదాపు రూ.12 కోట్లతో అభివృద్ధి పనులను పూర్తి చేశామన్నారు. స్థానిక ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు, ప్రజా ప్రతినిధులు కృషి చేయాలని ఆదేశించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు నారాయణ స్వామి, శ్రీనివాసులు, జెడ్పీటీసీ ఏరూరు శేఖర్, ఎంపీపీ శ్రీరాములు, మండల కో–ఆప్షన్ మెంబర్ బాషా, ఈరమ్మ, బోయ ఎల్లమ్మ, జీరా నాగమ్మ, మోతి ఎల్లమ్మ, వైస్ ఎంపీపీ నాగవేణి, హనుమయ్య, గోవిందు, శ్రీధర్, ఈరన్న, సచివాలయ ఉద్యోగులు, గ్రామ వలంటీర్లు, కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.